
# సిగ్గు! సిగ్గు!!

కుష్వంత్ సింగ్




తెలుగు: పి. హైమవతి


పట్టణమంతా నిశ్శబ్దంగా ఉంది. అది నిశ్శబ్దాన్ని గుర్తుచే నిశ్శబ్దం. దుకాణాలన్నీ మూసిఉన్నాయి. ఇళ్ళ తలుపులన్నీ అతి భద్రంగా వేసి ఉన్నాయి. ఖాళీగా ఉన్న రోడ్లమీద కాంతి తక్కువ దీపాల వెలుతురు పడుతోంది. ఇనుప టోపీలు ధరించి, భుజాలమీద తుపాకులు వేళ్ళాడదీసుకుని కొద్దిమంది పోలీసులు మాత్రం అటు, ఇటు తిరుగుతున్నారు. వారి బూట్ల నాడాల చప్పుడు మాత్రం నిశ్శబ్దాన్ని భంగపరుస్తోంది.

అర్ధచంద్రుడు తన గుడ్డి వెలుతురును రోడ్లమీద ప్రసరింపజెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. సన్నటి గాలి రోడ్డుమీద చెత్త కాయితాల్ని అటు, ఇటు కదుపుతోంది, వాతావరణం చల్లగా ఉంది. వసంతకాలం హాయిగా ఉంది. కొన్ని కుక్కలు ఒకచీకటి సందులోంచి బైటికివచ్చి దీపస్తంభం చుట్టూ చేరాయి. ఇద్దరు పోలీసులు వాటిని చూస్తూ నవ్వుకుంటూ వెళ్ళిపోయారు. అందులో ఒకడు ఏదో బూతుమాట అన్నాడు. మరొకడు రాయితీసి విసురుతున్నట్టుగా నటించి భయపెట్టాడు. కుక్కలన్నీ రోడ్‌కి మరోవైపు పరుగెత్తి - ప్రమాదరహితమైన ప్రదేశంలో కల్సుకున్నాయి.

రాణి రోడ్లమీద తిరిగే ఆడకుక్క - దాని సంతానం పట్నంలోని అన్నివీధుల్లోను, సందుల్లోను కనిపిస్తాయి. అది సన్నగా మిగతా ఊరకుక్కల్లాగాక విచిత్రంగా ఉంటుంది. దానివంటి రంగు తెల్లగా అక్కడక్కడ నల్లమచ్చలతో ఉంటుంది. అది ఎప్పుడూ తోక వెనకాల కాళ్ళమధ్య దాచుకుని భయంభయంగా, బతుకు భయంతో తిరుగుతూంటుంది.

రామ్‌జవాయ అనే కొట్టువాడు అడ్డుకోక పోయినట్టయితే రాణి మొదటిసారి ఎనిమిది పిల్లల్ని పెట్టినపుడేచచ్చిపోయుండేది. అది అతని దొడ్లో పిల్లల్ని పెట్టిన కారణంగా అతని కుటుంబ సభ్యులు దానికి తిండిపెట్టి దాని పిల్లలతోఆడుకొనేవారు. వాటికి బతుకు తెరువు తెల్సి తిండి దొంగిలించే వయసు వచ్చేదాకావాళ్ళే కుక్కపిల్లల్ని పోషించారు. రాణి అతనిఇంట్లో అలవాటయ్యింది. ప్రతి సంవత్సరం వసంతకాలం రాగానే అది రమ్‌జాన్ అనే ముస్లిం స్వీటు దుకాణం దగ్గరకి చేరుతుంది. అతను స్వీట్లు పెట్టి అమ్మే చెక్కబల్లకింద మోతీ అనే మగ కుక్క ఉంటుంది. కొద్దివారాల తర్వాత రాణి రామ్‌జవయ రోడ్లో ఆరుకి తక్కువ కాకుండా పిల్లల్ని కంటుంది. ఇది ప్రతి సంవత్సరం జరిగే విషయమే!

మోతీని, దాని ధృడత్వాన్నిచూస్తే రమ్‌జాన్‌కి గర్వం కలుగుతుంది. రమ్‌జాన్ మోతీ చెవుల్ని, తోకని కత్తిరించేసాడు మొత్తం ఊరి కుక్కల్లోకల్లా బలమైనదిగా దాన్నిపెంచిపోషించాడు. రాణికి ప్రతికాముకులు చాలామంది ఉన్నారు, అయినా అది మోతి




దగ్గరకు చేరుకుంటుంది.

ఈసారి వపంతకాలం వచ్చింది. కాని వస్తూ ఆ పట్నానికి మతకలహాల్ని, నిషేధాజ్ఞల్ని తెచ్చింది. పగలు జనం పది, ఇరవై మంది గుంపులుగా వీధి మొగలలో నిలబడి గుసగుసలాడుకుంటారు. దుకాణాలేవీ తెరవడంలేదు. ఇంకా కర్ఫ్యూ సమయం రాకముందే వీధులన్నీ నిర్మానుష్యం అయిపోతాయి. వీధుల్లో కుక్కలు, పోలీసులు మాత్రం యథేచ్ఛగా పంచరిస్తారు....


ఆ రాత్రి మోతీ కనిపించటంలేదు. కర్ఫ్యూ విధించినప్పట్నుంచి రమ్‌జాన్ మోతీని తన మంచానికి కట్టేసి ఉంచుతున్నాడు. వీధుల్లో తిరగడంకన్నా ఈ పరిస్థితుల్లో ఇంటి కాపలా మోతీ బాధ్యత అని అతసుభావించాడు. రాణి రమ్‌జాన్ దుకాణం దగ్గరికివచ్చి, అటు ఇటు తిరిగింది. కాని కొద్దిరోజులుగా మోతీ అక్కడ కనిపించడం లేదు. రాణి నిరాశపడింది. పసంతకాలం సంవత్సరానికి ఒక్కసారే వస్తుంది. అందులోను ఈసారి కుక్కలకి మరీహాయిగా ఉంది. అల్లరిచేసే చిన్నపిల్లలుగాని, రాళ్ళు విసిరే పెద్దలుగాని రోడ్‌మీదలేరు. రాణి మోతీకోసం వెతకడం మానుకుని రామ్‌జవాయ ఇంటివైపుకి నడక సాగించింది. స్వయంవరం కోసం పోటీపడుతున్న మగకుక్కలు వెంటబడ్డాయి.

రామ్‌జవాయ ఇంటిముందు కుక్కలన్నీ చేరాయి. మగకుక్కలు ఒకదానిపై మహాకటిమొరుగుతూ, పోటీపడుతున్నాయి. రాణి తన నిర్ణయం ఇవ్వకుండా కాసేపు వేచి చూసింది. చివరకి బలమైన ధృఢమైన నల్లకుక్కకి గౌరవందక్కింది. మిగిలిన కుక్కలన్నీ తలోవైపుకి వెళ్ళిపోయాయి.

రమ్‌జాన్ ఇంటిలో మోతీ మంచంకింద పడుకుని యజమానిని గమనిస్తోంది. కొద్దిరోజులుగా వసంతకాలం తాలూకు వాసన దాన్ని అశాంతితో నింపుతోంది, రోడ్‌మీద కుక్కలఅరుపులు, మొరుగులు అది వింది. దానికి రాణి తాలూకు వాసన గాలిలో తగిలింది. కాని రమ్‌జాన్ దాన్ని పోనివ్వడం లేదు. కట్టిన తాడు లాక్కునే ప్రయత్నం చేసి మానుకుంది. రమ్‌జాన్ బలమైన చేయి దానిమీదపడింది. మరికొంతసేపు పోయాక మళ్ళీ తాడు లాక్కునే ప్రయత్నం చేసింది.... మతకలహాలవల్ల రమ్‌జాన్ చాలా రాత్రులు మెలకువగా ఉన్నాడు. అందుచేత బాగా నిద్రపట్టేసింది. అతను గురకపెట్టినిద్రపోతున్నాడు. మోతీ గట్టిగా మొరిగి కృతజ్ఞతలేని యజమానివైపుచూస్తూ పెద్దగా ఏడ్చింది. మెడకుకట్టిన తాడు విప్పుకోవాలన్న ప్రయత్నంలో గట్టిగాలాగి, మొరగడం మొదలెట్టింది. కుక్కను కొట్టడానికని రమ్‌జాన్ మంచంమీంచిలేచాడు. మోతీ తలుపు వైపు వెడుతూ మంచాన్ని కూడా లాక్కుపోయింది, మూతితో తలుపులుతెరిచి బైటికి వెళ్ళిపోయింది. మంచం లోపల, మోతీబైట ఉండిపోయాయి. మోతీ మెడకున్న తాడు బిగిసిపోయింది. గట్టిగా రెండుసార్లు గుంజేసరికి ముడివిడిపోయింది. వెంటనే కుక్క రోడ్డమ్మట పరుగు ప్రారంభించింది. రమ్‌జాన్ తన గదిలోకివెళ్ళి కత్తి బొడ్లో దోపుకుని మోతీ వెనకాల పరుగెత్తాడు.

రామ్‌జవాయ ఇంటిబైట రాణికి, నల్లకుక్కకి ప్రణయం సాగుతోంది. అనుకోకుండా అక్కడ మోతీ దర్శనమిచ్చింది. గట్టిగా మొరుగుతూ మోతీ రాణి ప్రియుడి మీదపడింది. మిగతా కుక్కలన్నీ ఆ గొడవ చేరుతాయి. మొరగడాలు, కరుచుకోడాలు, పరుగులు, తరమడాలు....

రామ్‌జవాయకూడా కాపలాకాస్తూ అనేక రాత్రులు నిద్రలేకుండా గడిపాడు. చివరికి అలసట, నిద్ర అతన్నివశంచేసుకున్నాయా రాత్రి. తన మంచం కింద పెద్ద రాళ్ళగుట్ట పేర్చుకుని, సోడాసీసాలు చేతికందేట్టు పెట్టుకుని అతను నిద్రపొయాడు. బైట శబ్దానికి అతనికి మెలకువవచ్చింది. అతను చేతిలోకి పెద్దరాయి తీసుకుని తలుపుతెరిచాడు. బండబూతులు తిడుతూ ఆరాయిని కుక్కలవైపు విసిరాడు. హఠాత్తుగా ఓ మూలనుంచి ఓ మానవాకారం రావడం. ఈ రాయివెళ్ళి



అతని తలకి తగలడం క్షణంలో జరిగి పోయింది.

రాయి తగలడంవల్ల రమ్‌జాన్‌కి పెద్ద దెబ్బేమీ తగల్లేదుకాని, హఠాత్పరిణామానికి మాత్రం అతను కంగారుపడ్డాడు. "చంపేస్తున్నారు" అనిగట్టిగా అరచి అతని బొడ్లోంచి కత్తి తీశాడు. ఇద్దరూ ఒకర్నొకరు ఓ క్షణం పాటుచూసుకుని ఎవరిళ్ళవైపువాళ్ళు గట్టిగా అరుచుకుంటూ పరుగెత్తారు. అంతవరకు ప్రశాంతంగా ఉన్న పట్నానికి జీవం వచ్చింది. అరుపులు కేకలు పెరిగాయి. యుద్ధంప[illegible]ందు పరిస్థితిలా హడావుడిగా ఉంది.

ఏంజరిగిందని అడుగుతూ జనం ఇళ్ళల్లోంచి బైటకివచ్చారు. ముస్లింమీద దాడి చేశారని కొందరు, లేదు హిందువులపై దాడిచేశారని కొందరుచెప్తున్నారు. ఎన్నో ఎత్తుకుపోయి వరికేమిత్తున్నారని మరికొందరు చెప్పారు. కొందరు గూండాలు దాడిచెయ్యడానికి బైల్దేరారు. కుక్కలు మొరగడం మొదలెట్టాయి. గూండాలువెళ్ళి ఒక స్త్రీపైన దాడిచేసారు. ఆమె పిల్లల్ని చంపేసారు. అలాజరిగినప్పుడు ఎదురు దాడులు జరుగుతాయి. జరిగాయి. అయిదుగురు కలిశారు. వాళ్ళుపదిమందయ్యారు. ఇరవై అయ్యారు. వందలమంది అయ్యారు. కత్తులు, బల్లాలు కిరసనాయిలు డబ్బాలుతీసుకుని రామ్‌జవాయ ఇంటిమీద దాడిచేసారు....వాళ్ళమీదకి సోడా సీసాలు, ద్రావకం, రాళ్ళు వచ్చిపడ్డాయి. గుడ్డిగా ఏవీ పట్టించుకోకుండా దాడిచేస్తూనే ఉన్నారు. కిరసనాయిలు డబ్బాలు చాలా ఖాళీ అయ్యాయి. చివరికి ఇంటికి నిప్పుపెట్టారు మంటలు రేగాయి. రామ్‌జవాయ ఇల్లు అంటుకుంది. దాంతోపాటు ఆ పేటలో వున్న హిందువులవి, సిక్కులవి, ముస్లిములవి ఎన్నో ఇళ్ళు మాడి మసైపోయాయి.

పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తేలేక కాల్పులుజరిపారు. అగ్నిమాపకదళంవారు హుటాహుటి రంగంలోకి దిగారు. కాని పట్నంలో మరోమూల ఇళ్ళు అంటుకున్నాయి. చాలినన్ని ఫైర్ ఇంజన్లు లేవు.

ఆ రాత్రి, మర్నాడు పగలు మంటలు లేస్తూనేఉన్నాయి. ఎంతోమందిచంపబడ్డారు. ఎన్నో ఇళ్ళు బూడిదైపోయాయి. రామ్‌జవాయ ఇల్లు ఆనవాలులేకుండా తగులబడిపోయింది. అతను అతికష్టంమీద ప్రాణాలు దక్కించుకున్నాడు. తర్వాత చాలా రోజుల పాటు ఆ సమాధులమీంచి పొగవస్తూనే ఉంది. ఒకప్పుడు ఎంతో హడావుడిగా, సందడిగా ఉండే ఆ పట్నం స్మశానంలా తయారయ్యింది.

చాలా నెలల తర్వాత అల్లర్లు శాంతించాక నెలకొన్నాక తన పాతఇల్లు చూసుకోడానికి వెళ్ళాడు రామ్‌జవాయ. ఆ ప్రదేశమంతా నల్లటి ఇటుకల పోగులతో నిండిఉంది. పూర్వం అతను పెరడు అని పిలిచే ప్రదేశంలో కాస్తంతజాగాఉంది. అక్కడ రాణి పిల్లలకు పాలిస్తూ పడుకునిఉంది. ఆ పక్కనే తనకి పుట్టని తన పిల్లల్ని కాపలా కాస్తున్నట్టుగా మోతీ నిలబడిఉంది. ❋